క్లుప్తంగా

సీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



ఐఎల్‌ఆర్ రూమ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బోనకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ బెజవాడ సైదులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ డ్రగ్ స్టాక్ బోర్డును, ఫార్మసీ రికార్డులను, వ్యాక్సినేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. ఐఎల్‌ఆర్ రూమ్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, దానయ్య, ఉదయ్‌శ్రీ, రాధాలత, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌లో హెల్ప్ డెస్క్

ముదిగొండ: ప్రభుత్వ పథకాలపై ముదిగొండ తహసీల్‌లో బుధవారం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ బరోసా కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని లబ్ధిదారులు అర్హులైన ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేందుకు హెల్ప్ డెస్క్ సద్వినియోగంచేసుకోవాలని అధికారులు కోరారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



రవికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భారతి

మధిర: మధిరలోని శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థి కొంగల రవికుమార్ ఇటీవల కోదాడలో జరిగిన అండర్–17 వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. పోటీల్లో ఆయన మూడో స్థానం దక్కించుకుని పతకం గెలుచుకోగా బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఆకెళ్ల భారతి అభినందించారు.

అకాడమీ కరపత్రాలు ఆవిష్కరణ

మధిర: మధిరకు చెందిన కళాకారుడు కళ్యాణపు నాగరాజు ఏర్పాటుచేస్తున్న కళాసాధన నృత్య కళానికేతన్ పేరుతో డాన్స్ అకాడమీ కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానికులకు శిక్షణ ఇచ్చేలా అకాడమీ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ఈనెల 24నుంచి కూచిపూడి, భరత నాట్యం, జానపదం, పాశ్చాత్య నృత్య శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

తల్లాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం అల్పాహారం కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులకు లయన్స్‌క్లబ్ చార్టెడ్ మెంబర్ నంబూరి నారాయణరావు ఆర్థిక సాయంతో పరీక్షలు ముగిసే వరకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీజీ ఎంజేఎఫ్ శివప్రసాద్, డిస్ట్రిక్ట్ జెఎల్‌టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, నారాయణరావు, వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలిన వెంకటరెడ్డి, మంగీలాల్, కళాశాల అధ్యాపకులు సుధారాణి, తమ్మిశెట్టి శ్రీనివాస్, శేషుప్రసాద్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

మధిర: మధిర పట్టణంలోని రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఫిబ్రవరి 2వరకు తాగునీరు సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ వైరా గ్రిడ్ సబ్ డివిజన్ డీఈ వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 42నుంచి ఫిబ్రవరి 2వరకు మండలంలోని అల్లీనగరం, బయ్యారం, దెందుకూరు, ఖమ్మంపాడు, చిలుకూరు, తొండల గోపవరం, తొర్లపాడు, మడుపల్లి, ఇల్లెందులపాడు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేయడం జరుగుతుందని, ద్విచక్రవాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గందరగోళంగా గ్రామసభలు

రెండో రోజైన బుధవారం కూడా నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. గ్రామసభల్లో ప్రదర్శిస్తున్న జాబితాలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత ఉండి జాబితాల్లో పేర్లు రాని వారు అధికారులపై మండిపడ్డారు. గ్రామసభల్లో ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగటంతో అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు.



కోమట్లగూడెం(గాంధీనగర్) గ్రామసభలో.. ఇందిరమ్మ కమిటీ సభ్యుడితో ఘర్షణ దృశ్యం

కారేపల్లి: ఎర్రబోడులో నిర్వహించిన గ్రామసభలో.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరుకాకపోవటం గమనార్హం. పూరిగుడిసెల్లో బతికే తమ పేర్లు మాత్రం జాబితాలో రాలేదని.. గ్రామానికి చెందిన గాదె ఉపేందర్, తగరం వీరయ్యలు అధికారుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఇదిలా ఉంటే.. తనకు తెలియకుండానే ఇందిరమ్మ కమిటీలో తన పేరు చేర్చారని, కానీ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు తప్పించారంటూ.. గాదె ఉపేందర్ లబోదిబోమంటూ ఏకరువుపెట్టాడు.



సీతారాంపురం గ్రామసభలో గందరగోళం

సీతారాంపురం గ్రామంలో..

ఓవక్క గ్రామసభ జరుగుతుండగా.. ప్రజలు నిలదీయటంతో తహసీల్దార్ సంపత్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న గ్రామ కార్యదర్శులు.. ప్రజలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

అనర్హులను ఎలా ఎంపిక చేశారు..?



వైరారూరల్: ముసలిమడుగు గ్రామంలో అధికారులను నిలదీస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గరికపాడు, గొల్లపూడి, గోవిందపురం, కొండకొడిమ, ముసలిమడుగు, నారపునేనిపల్లి, పాలడుగు, రెబ్బవరం, కేజీ సిరిపురం పంచాయతీల్లో అధికారులు బుధవారం నాలుగు సంక్షేమ పథకాలలో లబ్ధిదారుల ఎంపికలో భాగంగా రెండో రోజు గ్రామసభను నిర్వహించారు. ముసలిమడుగు గ్రామంలో లబ్ధిదారుల పేర్లను అధికారులు జాబితాలో చదువుతుండగా.. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు గుత్తా నాగేశ్వరరావు, మెండెం కృష్ణంరాజులు మాట్లాడారు. అనర్హులను ఎందుకు ఎంపిక చేశారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ గ్రామ సభ వద్దకు చేరుకుని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది. గోవిందాపురంలో 27మంది ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక కాగా.. ఏళ్లుగా గుడిసెలు, రేకులషెడ్డులో ఉంటున్న మా పేరు ఎందుకు రాలేదని అదికారులను నిలదీశారు.

ఏన్కూరు: మండలంలోని జన్నారం, ఏన్కూరు, జన్నారం ఎస్టీ కాలనీ, కేసుపల్లి, మేడేపల్లి, పీకే బంజర, రేపల్లెవాడ, తిమ్మారావుపేట, ఎర్రబోడుతండలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంబాబు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, ఎఓ నర్సింహారావు, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

కొర్లగూడెం గ్రామసభలో..

కల్లూరురూరల్: నారాయణపురం, వెన్నవల్లి, మర్లపాడు, చంద్రుపట్ల, లక్ష్మీపురం, పెద్దకోరుకొండ, బత్తులపల్లి, ఓబులరావుబంజరు పడమర లోకవరం, పాయపూరు, తూర్పులోకవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కొర్లగూడెంలో ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఆర్డీఓ రాజేంద్ర గౌడ్ హాజరయ్యారు. సభలో వివరాలు ప్రకటిస్తున్న సమయంలో ఒకే ఇంట్లో ముగ్గురికి ఇళ్లు ఎలా ఇస్తారని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కారును అడ్డగించగా.. పోలీసులు ప్రజలను శాంతింపజేశారు. ఆర్డీఓ రుణమాఫీ కాని రైతుల వివరాలు, ఇందిరమ్మ గృహాలు, కార్డులు లేని వారి వివరాలను అందించాలని అధికారును ఆదేశించారు.



తల్లాడ: మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీదేవి

దరఖాస్తులు వెల్లువ..

తల్లాడ: మండలంలో రేజర్ల, బాలపేట, కలకొడిమ, రామచంద్రాపురం, మంగాపురం, లక్ష్మీపురం, మల్లారం, నూతనకల్ గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. ప్రజలు నిలదీయగా.. అధికారులు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రకియ గ్రామసభల్లో కాకుండా తహసీల్‌లో, మండల పరిషత్ కార్యాలయాల్లో ఎప్పుడైన అర్హులు తమ దరఖాస్తులు ఇవ్వొచ్చన్నారు. ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి, ఏఓ తాజుద్దీన్, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ఎ.సింధు, అయేషా పాల్గొన్నారు.

మా పేరు ఎందుకు లేదు..

పెనుబల్లి: మండలంలోని కొత్తలంకపల్లి, మండాలపాడు, పాతకుప్పెనకుంట్ల, పెనుబల్లి, కర్రాలపాడు, కోంద్రుపాడ, కొత్తకారాయిగూడెం, లంకపల్లి, పార్థసారథీపురం, రామచంద్రారావుబంజర్, తాళ్లపెంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆ జాబితాలో మా పేర్లు ఎందుకు లేవంటూ రామచందర్‌రావు బంజర్, పాతకుప్పెనకుంట్ల గ్రామాల్లో లబ్ధిదారులు ఆందోళన చేశారు. అదే విధంగా మండలంలోని మండాలపాడు గ్రామ సభను సీపీఎం మండల కార్యదర్శి తిరుపతిరావు సందర్శించ.. అధికారులు ఇప్పటికైన నా నిజమైన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, పెనుబల్లి పంచాయతీ ప్రత్యేకాధికారి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ముస్తఫా పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలోని గ్రామసభలో..

రేగళ్లపాడులో..

సత్తుపల్లిరూరల్: పెళ్లికానివారికి జాబితాలో ఇళ్ల మంజూరు చేయటంపై సత్తుపల్లి మండలం రేగళ్లపాడులో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం సత్తుపల్లి మండలంలో రేగళ్లపాడు, చెరుకుపల్లి, రామానగరం, నారాయణపురం, రుద్రాక్షపల్లి, పాకలగూడెం, గౌరిగూడెం, కొత్తూరులలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. రుద్రాక్షపల్లి, రేగళ్లపాడులలో అధికారుల తీరుపై స్థానికుల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, సీఐ టి.కిరణ్, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారుల నిలదీత..

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం, బనిగండ్లపాడు, ఇనగాలి, కాచావరం, కండ్రిక, మామునూరు, పెద్దగోపవరం, ఎర్రుపాలెం, గుంటుపల్లి గోపవరం, కొత్తపాలెం,పెగళ్లపాడు, రాజులదేవరపాడు, వెంకటాపురం, తెల్లపాలెం, తక్కెళ్లపాడు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో రెండో రోజు బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో అధికారులతో వాగ్వావాదానికి దిగగా.. స్పందించిన ఎంపీడీఓ సురేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషాశారద, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ నాగరాజు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, కలకోట, సీతానగరం, నారాయణపురం, ఆళ్లపాడు, తూటికుంట్ల గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించాయి. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి విజయబాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పండితులు శ్రీభమిడి పార్టీ రవి కృష్ణశర్మ స్పష్టం చేశారు. బుధవారం కల్లూరు, పేరువంచ జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే అన్ని సబ్జెక్టులలో పట్టు సాధించాలని పమిడిపాటి రవికృష్ణశర్మ పేర్కొన్నారు. విద్య విషయంలో సోమరితనం పనికిరాదని, క్రమశిక్షణ కలిగి ఉండి మంచి ఫలితాలు సాధించాలన్నారు. టెన్త్‌లో 10/10 సాధించిన విద్యార్థులకు తన సొంత ఖర్చులతో విమానంలో బెంగూరుకు తీసుకెళ్లి చూపించి తెస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మున్సిపల్ పాలకవర్గం



మున్సిపల్ చైర్మన్ మహేష్‌ను సన్మానిస్తున్న కేటీఆర్, వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం హైదరాబాద్ తెలంగాణ భవనంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లను కేటీఆర్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 23 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ తరుపున గెలిచి అధికారం మారిపోయిన 17మంది కౌన్సిలర్లు ఇంకా పార్టీలోనే కొనసాగటం అభినందనీయమన్నారు. ఈసారి కేసీఆర్ సీఎం చేసేలా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై కళాజాతా

ఏన్కూరు: మండలంలోని కేసుపల్లి, హిమామ్‌నగర్ గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కళావతిబాయి ఆదేశాల మేరకు కళాజాతా బృందం బుధవారం ప్రదర్శన చేశారు. డెంగీ, మలేరియా, ఊపిరితిత్తుల జబ్బులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, ముర్రిపాలు ప్రాముఖ్యత గురించి ఆటపాటలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రాములు, సీహెచ్‌ఓ శివరాజు, వైద్యబృందం, కళాజాతా బృందం పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



త్రిషను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న ఇంటి త్రిష ఖమ్మంలో బుధవారం నిర్వహించిన ఆంగ్లం వక్తృత్వ పోటీల్లో ద్వితీయ బహుమతి పొందింది. ఈ మేరకు జిల్లా పరిషత్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో త్రిషను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, హెచ్‌ఎం ఎలమద్ది రమణయ్య, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బత్తిని రామనాథం పాల్గొన్నారు.

సరిపడా యూరియా ఉంది..

బోనకల్: మండలంలోని బోనకల్ సహకారసంఘంలో యూరియా నిల్వ సరిపడ ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరావు కోరారు. బోనకల్ సొసైటీ పరిధిలోని చిరునోములు, బోనకల్ గ్రామాల రైతు సోదరులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులకు పథకాలను అందించాలి



మాట్లాడుతున్న సుదర్శన్

వైరా: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఆరు గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ భరోసా పథకాన్ని భూమి లేని ప్రతి నిరుపేదకు వర్తింప చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. బుధవారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం వైరా డివిజన్ కమిటీ సమావేశం సుంకర సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనరావు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25, నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమేష్, వైరా నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం పార్టీ కార్యాలయంలో..

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, నాయకులు కోటేశ్వరరావు, హనుమంతరావు, వెంకట్రామయ్య, బసవయ్య తదితరులున్నారు.

లచ్చగూడెంలో..

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య మాట్లాడారు. సర్వేలో అనర్హుల పేర్లు ఎక్కువగా ఉన్నాయని.. అర్హులకు పథకాలను అందించకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

వైరా: నాలుగు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. బుధవారం వైరాలోని 4వ వార్డులో నిర్వహించిన పట్టణ సభకు ఆయన హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు దక్కుతాయన్నారు. అధికారులు ప్రవేశ పెట్టిన జాబితాలో పేర్లు లేని వారు మరలా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గంగారావు, ఎస్‌కే మున్నీ, ఏఈ మాన్య షేక్ బీబా, భాస్కర్, రజిని, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, తదితరులు

చింతకాని మండలంలో..

చింతకాని: మండలంలోని కొదుమూరు, గాంధీనగర్‌కాలనీ, సీతంపేట, లచ్చగూడెం, మత్కేపల్లి, పాతర్లపాడు, ప్రొద్దుటూరు గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. మత్కేపల్లి గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరా శాఖాధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, మండల వ్యవసాయాధికారి మానస, ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివమ్మ, ఎంపీఓ పర్వీన్ ఖైసర్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్, పీఆర్ ఏఈఈ రోహిత్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిక్‌నగర్‌లో టెంట్ పడవేసి నిరసన తెలిపిన గ్రామస్తులు..

కొణిజర్ల: మండలంలోని సిద్దిక్‌నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసాకు అర్హతలేని వారిని ఎంపిక చేశారంటూ.. గ్రామస్తులు ఆగ్రహంతో టెంటు పీకేసి నిరసన తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారి ఏఓ బాలాజీ విషయాన్ని ఎంపీడీఓ రోజారాణికి తెలుపగా.. ఆమె ఎస్సై జి.సూరజ్‌తో కలిసి అక్కడకు వచ్చి మాట్లాడుతూ.. గ్రామసభ ఆమోదం పొందితేనే లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపినా గ్రామస్తులు శాంతించలేదు. దీంతో ఎస్సై గ్రామస్తులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజేశ్వరి, ఏఓ బాలాజీ, ఎంఈఓ అబ్రహం, ఏఈలు వసుంధర, మనోజ, నవీన్‌కుమార్, హార్టీకల్చర్ ఆఫీసర్ వేణు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మల్లుపల్లిలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

పడిగాపులు.. అవస్థలు..

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో.. లేవోనని చూసేందుకు సత్తుపల్లి మున్సిపాలిటీలో బుధవారం జరిగిన 7, 18, 19, 20, 21, 22, 23వ వార్డు సభల్లో పడిగాపులు పడుతూ అవస్థలు పడాల్సి వచ్చింది. వార్డు సభల ప్రాంగాణాల్లో కాకుండా ఎండలో జాబితాలను కర్రలకు తగిలించటంతో ఆ జాబితాల్లో పేర్లు చూసేందుకు ఎండలోనే ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పోటీపడి మరీ చూసేందుకు గుమ్మికూడటంతో గందరగోళం ఏర్పడింది. పథకాలు రాలేదని అధైర్యపడవద్దని మళ్లి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సభల్లో ప్రజలకు విజ్ఞప్తులు చేశారు. ఈ కార్యక్రమాలలో కమిషనర్ రవిబాబు, మేనేజర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలీ, పద్మజ్యోతి, ఎండి కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న లబ్ధిదారులు

గ్రామసభను సందర్శించిన డీపీఓ

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి, కట్టకూరు, న్యూలక్ష్మీపురం, ముత్తారం, పండ్రేగుపల్లి, సువర్ణాపురం, వల్లబి, వనంవారికిష్టాపురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ సభను కొంత సేపు మధ్యలోనే నిలిపివేశారు. గోకినేపల్లి గ్రామసభలో సీపీఎం, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చెలరేగింది. పోలీసుల ఆపడంతో సద్దుమణిగించారు. వల్లబిలో జరిగిన గ్రామ సభకు డీపీఓ ఆశాలత హాజరైయ్యారు. అర్హులైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. మరో గ్రామసభ ఉండడంతో ఎంపీఓ గ్రామ సభ పూర్తి అయ్యేవరకు ఉండలేదని వెనక్కి పిలిపించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఏఓ వేణు, ఎంపీఓ వాల్మికి కిషోర్, ఏంఈఓ రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వల్లబి గ్రామ సభలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని తెలిపారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పి ల్లలకు అవసరమైన సహాయ పరికరాలను కూడా అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.



పలు గ్రామాల్లో బుధవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9.30 గంటల వరకు పొగమంచు నిండిపోయింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని మరీ ప్రయాణించారు. లైట్లు వేసినప్పటికీ మంచు కారణంగా కొద్ది దూరంలో ఉన్న వాహనాలు సైతం కనపడలేదు. దీంతో పలువురు ద్విచక్రవాహనదారులు చలికి గజగజ వణుకుతూనే ప్రయాణించారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: పినపాక బ్రిడ్జి వద్ద లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు



మధిర: మంచులో వెళ్తున్న వందే భారత్ రైలు



తల్లాడ: రింగ్ సెంటర్‌లో..